# కోపతాపం

## విన్నకోట సుశీలాదేవి

**రేవంత్ కనపడకుండా పోయి వారం రోజులైంది. ఇక తమకి, రేవంత్‌కి రుణం తీరిపోయిందని అతని తల్లిదండ్రులు నిరాశ చేసుకున్నారు. ప్రతిక్షణం రేవంత్ జ్ఞాపకాలతో తిండీ నిద్రా మానేసి కృశించిపోతున్నారు.**

"పక్కింటివాళ్ల రేవంత్‌ని చూడు. ఎంత బాగా చదువుతున్నాడు. నువ్వూ వున్నావ్. చదువురాని వెధవ్వి.." సుమిత్ర కోపంగా అంటోంది.

ఆరేళ్ళ రవి తల్లివేపు తీక్షణంగా ఒకసారి చూసి తిరిగి పుస్తకంలోకి తలదూర్చాడు.

సుమిత్ర ఇంకా పక్కింటివాళ్ళబ్బాయిని పొగుడుతూనే వుంది. తల్లి ఇలా ప్రతి దానికీ తనని పక్కింటి రేవంత్‌తో పోల్చడం రవికేమాత్రం ఇష్టం వుండదు.

"అమ్మా ఎప్పుడూ రేవంత్‌నే పొగుడుతావు. నన్నెప్పుడూ మెచ్చుకోవే" దుఃఖంతో అన్నాడొకసారి.

సుమిత్ర వాడి బాధని పట్టించుకోలేదు. పైగా "రేవంత్ ఎంతో బుద్ధిమంతుడురా. అందుకే వాడిని మెచ్చుకుంటాను. నువ్వొట్టి అల్లరి వెధవ్వి. నీలో ఒక్క మంచి లక్షణమైనా వుందా" అంది. తల్లి అలా అనేసరికి రవికి కోపం వచ్చి చేతిలోని పాలగ్లాసు విసిరికొట్టాడు. ఫలితంగా సుమిత్ర వాడి వీపు వాయకొట్టింది. రవి ఏడుస్తూ పడుకున్నాడు.

ఏడాది క్రితం రేవంత్ వాళ్ళ కుటుంబం పక్కింట్లోకి అద్దెకు దిగారు. వాళ్ళు వచ్చిన కొత్తలో రవి ప్రక్కింటి రేవంత్‌తో చాలా స్నేహంగా వుండేవాడు. కానీ సుమిత్ర రేవంత్‌ని పొగిడి – రవిని తక్కువచేసి మాట్లాడటం మొదలెట్టినప్పటినుండీ రవి రేవంత్‌పై ద్వేషం పెంచుకున్నాడు.

అమ్మ రేవంత్‌ని ఎందుకలా మెచ్చుకుంటుంది? రేవంత్ కంటే నేను అన్నిట్లోనూ ఫస్టుకదా, ఏదో ఒక చిన్న పొరపాటు చేస్తే దానికోసం రేవంత్‌తో పోల్చి తనని తిడుతుంది. అమ్మకి రేవంత్ అంటే ఎందుకింత ఇష్టమో...." రవి లేత మనసులో ఆలోచనల సుడిగుండం చెలరేగింది. రవికి ప్రతిక్షణం ఇవే ఆలోచనలు... అమ్మ తనని మెచ్చుకోవడం లేదనే బెంగ తనంటే ఇష్టంలేదనే దుఃఖం. వీటితో ఆరేళ్ళ రవి మానసికంగా క్రుంగిపోసాగాడు. పరధ్యానం ఎక్కువైంది. చదువుపై ధ్యాస తగ్గింది. దీనితో ఇంకా ఎక్కువ తప్పులు చేయసాగాడు. చదువుపై ధ్యాస తగ్గడంతో మార్కులు ఇంకా చాలా తక్కువ వచ్చాయి.

దీనితో సుమిత్ర తిట్లు ఇంకా ఎక్కువయ్యాయి.

* * *

ఒకరోజు సాయంత్రం —

"రవీ ఆడుకుందాం వస్తావా" రేవంత్ బ్యాట్ పుచ్చుకుని వచ్చాడు.

రవి ఒంటరిగా మెట్లమీద కూర్చుని వున్నాడు. రేవంత్ చేతిలోని బ్యాట్–బాలు చూడగానే రవికి వుత్సాహం కలిగింది. లేచి వెళ్ళబోయాడు. ఇంతలో

"రవీ! అలా ఒక్కడివే కూర్చోకపోతే వెళ్ళి ఆడుకోరాదూ.. ఆ రేవంత్ చూడు.." సుమిత్ర వంటింట్లోంచి అంటున్న మాటలు విన్పించాయి.

అది విని రేవంత్‌తో వెళ్ళబోయిన రవి ఆగిపోయాడు. కోపం వుక్రోషం కలిగాయి!

"రవీ... రా..." చెయ్యి పట్టుకుని పిలుస్తున్న రేవంత్‌ని రెండు చేతుల్తో విసురుగా తోసేశాడు.

"అమ్మా" అని అరుస్తూ రేవంత్ క్రిందపడిపోయాడు. రవి గబగబా లోపలికొచ్చి తలుపేశాడు.

"ఏమిట్రా గొడవ...." సుమిత్ర మాట పూర్తికాకుండానే కాలింగ్‌బెల్ మ్రోగింది.

సుమిత్ర వెళ్ళితలుపుతీసింది.

ఎదురుగా ఏడుస్తున్న రేవంత్ – కోపంతో ఎర్రబడ్డ ముఖంతో రేవంత్ తల్లి నిలబడివున్నారు.

"రండి" నవ్వుతూ ఆహ్వానించబోయింది. "చాల్లెండి... మీ మర్యాద. మీ రవి మావాడినెలా కొట్టాడో చూశారా! ఇంకోసారి ఇలా జరిగిందంటే వూరుకోను మీ అబ్బాయిని అదుపులో పెట్టుకోండి.." అంటూ బెదిరించింది.

ఆవిడలా అనేసరికి సుమిత్రకు కూడా రోషం వచ్చి కొడుకును వెనకేసుకొచ్చి ఆవిడతో పోట్లాడబోయింది. కానీ ఆవిడ వచ్చినంత విసురుగా రేవంత్‌ని తీసుకు వెళ్ళిపోవడంతో సుమిత్ర హతాశురాలైంది. ఆ కోపాన్ని కొడుకుపై చూపింది.

"రేవంత్‌ని ఎందుక్కొట్టావ్. మరీ అల్లరి వెధవ్వి అవుతున్నావ్. ఆ రేవంత్ చూడు ఎంత మంచివాడో.." అంటూ మళ్ళా ఎప్పటిలా కొడుకుని రేవంత్‌తో పోల్చడం మొదలెట్టింది.

రవికి తల్లి తనని కొట్టిన దెబ్బలకంటే, రేవంత్‌తో తనని పోల్చడమే ఎక్కువ బాధ కలిగించింది.. బిగ్గరగా ఏడవడం మొదలెట్టాడు.

* * *

పై సంఘటన జరిగిన వారం రోజుల తర్వాత.. పక్కింట్లోంచి పెద్దగా ఏడుపు విన్పిస్తే సుమిత్రవాళ్ళింటికెళ్ళింది. సుమిత్రని చూస్తూనే – "ఏవండీ.. మా రేవంత్ కనబడటం లేదు.." అంటూ రేవంత్‌తల్లి సుమిత్రని కౌగలించుకుని ఏడవసాగింది.

సుమిత్ర తెల్లబోయింది.

"నిజంగానా.. అంతా చూశారా?"

"ఆ.."

అప్పటికి టైము రాత్రి ఏడుగంటలైంది. రోజూ రేవంత్ సాయంత్రం ఏదు గంటలకే స్కూలునుండి వచ్చేస్తాడు. స్కూలు ఎక్కువదూరం కాకపోయినా రేవంత్‌కి స్కూలురిక్షా ఏర్పాటు చేశారు. ఆ రోజు రేవంత్ తండ్రి ఇంట్లోనే వుండటంతో ఆయన రేవంత్‌ని తీసుకురావడానికి నాలుగున్నరకి స్కూలుకెళ్లాడు.

ఒక పావుగంట క్రితమే మరో ఇద్దరు పిల్లలతో కలిసి పార్కుకెళ్లాడని రేవంత్ క్లాసు పిల్లలు చెప్పారు. కానీ కూడావెళ్ళిన ఆ ఇద్దరు పిల్లలెవరో వాళ్ళు చెప్పలేకపోయారు.

పార్కంతా వెతికాడాయన. కానీ ఎక్కడా రేవంత్ కనబడలేదు. రేవంత్ స్నేహితుల ఇళ్ళల్లో కూడా వెతికి చివరకు ఏడుగంటలకు ఇంటికొచ్చాడు.

భర్త నోటవెంట విషయం విన్న రేవంత్ తల్లి ఏడవడం మొదలెట్టింది. సుమిత్ర ఆమెని ఓదార్చసాగింది.

"రేవంత్‌కేం కాదు. ఏ స్నేహితుడి ఇంట్లోనే వుండి వుంటాడు. మా రవిని కూడా కనుక్కుంటాగా. మీరు ఏడవకండి. రేవంత్ క్షేమంగా ఇంటికొస్తాడు..." ఆమెకు వూరట కలిగించి సుమిత్ర ఇంటికొచ్చింది.

"ఎక్కడికెళ్లావ్ సుమిత్రా?" భర్త శ్రీనివాసరావు అడిగాడు. భర్తతో జరిగింది చెప్పి రవిని పిల్చింది.

"ఏరా! రవీ, మీరిద్దరూ ఒకే క్లాసుకదా! రేవంత్ గురించి నీకేమన్నా తెలుసా", అంది.

రవి క్షణకాలం తత్తరపడ్డాడు. కానీ వెంటనే "నాకేం తెలీదు" అనేసి తన గదిలోకి వెళ్ళిపోయాడు.

ఆతడి మాటని సుమిత్ర గమనించలేదుకానీ, శ్రీనివాసరావు గమనించాడు. కానీ అప్పటికేం మాట్లాడకుండా ఊరుకున్నాడు.

* * *

రేవంత్ కనబడకుండా పోయి రెండ్రోజులైంది. రేవంత్ ఇక కనబడడేమోనని అతని తల్లిదండ్రులు



భయపడిపోయారు.

ఈ రెండ్రోజులూ సుమిత్ర రవిని ఎవరితోనూ పోల్చడంలేదు. రవికిది చాలా ఆనందంగా వుంది. రవి ఇప్పుడు ఇదివరకంటే వుత్సాహంగా వున్నాడు. త్వరగా లేచి తన పనులు తానే చేసుకుంటున్నాడు. టైముకు స్కూలుకెడుతున్నాడు. హోంవర్క్ కూడా ఎవ్వరూ చెప్పకుండానే చేసుకుంటున్నాడు. ఆ వీధి పిల్లలతో చేరి ఆడుకుంటున్నాడు. ఇప్పుడా యిల్లు రవి అల్లరితో, మాటలతో నవ్వులతోమార్మ్రోగిపోతోంది.

రవిలో వచ్చిన మార్పు సుమిత్రకు చాలా ఆశ్చర్యాన్నికలిగించింది.భర్తకి అదే చెప్పింది. శ్రీనివాసరావు మాత్రం రవిలోని మార్పునకు కారణాన్ని కొంత వూహించగలిగాడు.

"సుమిత్రా! నీకో విషయం చెప్పాలనుకుంటున్నాను"

"ఏమిటండి అది".

"ఈ కాలపు పిల్లలు పుట్టుకతోనే తెలివితేటల్ని ప్రదర్శిస్తున్నారు. వాళ్ళ మనస్సు, ఆలోచనల్లో కూడా ఈ రోజుల్లో ఎంతో పరిణతి కనబడుతోంది. ఇక తల్లిదండ్రుల విషయానికొస్తే ఈ రోజుల్లో అందరికీ ఒకరో ఇద్దరో సంతానం దీనితో తల్లిదండ్రుల దృష్టంతా వాళ్ళ మీదే కేంద్రీకరిస్తున్నారు. తమ పిల్లలు అన్ని విషయాల్లోనూ ఫస్టు వుండాలని. దీనితో తన స్టేటస్ పెంచుకోవాలని తాపత్రయపడుతున్నారు. అటువంటి కోరికలుండటం మంచిదే. కానీ దాని కోసం తమ పిల్లల్ని బాధించకూడదు కదా!"

"ఇంతకీ మీరు చెప్పేదేమిటి? రవిని నేను బాధిస్తున్నానంటారా"

"అవును!"

"ఏం చేస్తున్నా? కొడ్తున్నానా! తిడ్తున్నానా!" రోషంగా అంది.

"అలా అయినా ఫర్వాలేదు. కానీ అంతకంటే ఎక్కువగా వాడిని రేవంత్‌తో ప్రతిదానికీ పోల్చి వాడిని బాధిస్తున్నావ్".

సుమిత్ర నివ్వెరపోయింది.

"రేవంత్‌తో పోలిస్తే బాధా. చాల్లే వూరుకోండి."

"సుమిత్రా! పిల్లల మనసులు చాలా సున్నితంగా వుంటాయి. వాళ్ళకి మెల్లగా చెప్పి బుజ్జగించాలేకానీ బాధించకూడదు. ముఖ్యంగా ఇతర పిల్లలతో పోల్చి హింసించకూడదు. అందుకే రవి – రేవంత్‌పై ద్వేషం పెంచుకుని చివరికిలా చేశాడు..." నిట్టూర్చాడు.

సుమిత్ర వెలవెలబోతూ – "అంటే" అంది.

క్షణం ఆగి మెల్లగా "రేవంత్ కనబడకుండా పోవడానికి మన రవే కారణం."

"అబద్ధం" పిచ్చిగా అరిచింది "నా రవి అలా చేయడు. వాడు అటువంటివాడు కాదు..."

"సుమిత్రా! అరవకు! నిజాన్ని భరించు"

సుమిత్ర ఏడువసాగింది.

"సుమిత్రా రవిముందు ఏడవకు వాడినేమీ అడగకు. నువ్వు మామూలుగా వుండు. మనమేదైనా అంటే వాడు ఇల్లొదిలి కూడా పారిపోవచ్చు అంటూ ఏడుస్తున్న సుమిత్రని దగ్గరకు తీసుకుని ఓదార్చసాగాడు.

సుమిత్రకు ఆ రాత్రంతా నిద్రపట్టలేదు.

'తన రవి రేవంత్‌ని చంపేశాడా. వాడి వయసెంత. వాడికిటువంటి ఆలోచనలెలా వస్తాయి? హఠాత్తుగా ఆమెకి మొన్నక్రితం తమ ఇంట్లో వీడియోలో చూసిన హారర్ చిత్రం గుర్తుకొచ్చింది. దానిలో పదేళ్ల పిల్లాడు స్కూల్లో తనకంటే అన్నివిధాలా అధికుడిలా వున్న కుర్రాడిని చంపేస్తాడు. ఆ సినిమా రవి కూడా చూసాడు'.

అయితే రవి కూడా ఆ సినిమాలోలా....

ఇక ఆపై ఆలోచించలేక దిండులో తలదూర్చి వెక్కివెక్కి

"దీనికంతకూ నేనే కారణం" అనుకోసాగింది.

* * *

రేవంత్ కనబడకుండా పోయి వారం రోజులైంది. ఇక తమకి రేవంత్‌కి ఋణం తీరిపోయిందని అతని తల్లిదండ్రులు నిరాశ చేసుకున్నారు. ప్రతిక్షణం రేవంత్ జ్ఞాపకాలతో తిండీ నిద్రా మానేసి కృశించిపోతున్నారు.

"అమ్మా! రేవంత్ చనిపోయాడా!"

రవి మొట్టమొదటిసారిగా నోరు విప్పాడు. కొడుక్కి స్పూన్‌తో టిఫిన్ తినిపిస్తున్న సుమిత్ర ఆ ప్రశ్నతో వులిక్కిపడింది. చేతిలో స్పూన్ జారిపోయింది.

"రేవంత్ చనిపోయాడని నీకెవరు చెప్పార్రా!" దడదడలాడుతున్న గుండెల్తో అడిగింది.

"ఎవరూ చెప్పలా! అమ్మా! మరే... ఎవరినన్నా చంపితే జైల్లో పెట్టి కొడ్తారా?" రవి ప్రశ్న సుమిత్ర శరీరాన్ని వేయి తూటాల్తో చీల్చినట్లయింది. చప్పున రవిని గుండెలకి హత్తుకుని—

"రవీ ఏమిటా పిచ్చిమాటలు"... అంది దుఃఖంతో గొంతు పూడుకుపోతుండగా!

"అవునమ్మా! రేవంత్‌ని నేనే చంపానమ్మా! వాడిని పార్కుకి తీసుకెళ్లి అక్కడున్న నీళ్లల్లో తోసేసాను" రవి మాటలకు సుమిత్ర గడగడవణికిపోయింది! ఎవరైనా వాడి మాటలు విన్నారేమోనని భయం భయంగా చుట్టూ చూసింది!

'రవీ... ఇలారా' వాడిని గదిలోకి లాక్కెళ్లి—

"రవీ! ఈ విషయం ఎవరితోనూ చెప్పకురా" మెల్లగా అంది.

"ఎందుకని?"

"ఒరేయ్ రవీ! అటువంటి ప్రశ్నలేసి నన్ను ఏడిపించకురా" రవిని కావలించుకుని ఏడ్వసాగింది.

తల్లి ఏడుపు చూసి రవి కూడా... "అమ్మా! ఎవరితోనూ చెప్పనులే ఏడవకమ్మా!" అన్నాడు.

ఇంతలో శ్రీనివాసరావు హడావుడిగా లోపలికొచ్చాడు.

"సుమిత్రా! ఈ విషయం విన్నావా? రేవంత్ తిరిగొచ్చాడు" అన్నాడు.

సుమిత్ర నమ్మలేకపోయింది.

"నిజంగానా?"

"అవును... నేనిప్పుడు వాళ్లింట్లోనుంచే వస్తున్నాను"

సుమిత్ర ఆనందంతో పొంగిపోయింది. క్షణం క్రితం ఆమె మనసులో వ్యాపించిన భయాలు పటాపంచలయ్యాయి— సంతోషంతో రవినెత్తుకుని ముద్దుల వర్షం కురిపించసాగింది.

"రవీ... నా బంగారు తండ్రీ విన్నావా! రేవంత్ క్షేమంగా తిరిగొచ్చాడు!" గిరగిరా తిప్పుతున్న రవిని అందుకుని క్రిందికి దించాడు శ్రీనివాసరావు.

"సుమిత్రా! ఏమిటీ పిచ్చి రేవంత్ తల్లిదండ్రులం కంటే ఎక్కువ ఆనందపడిపోతున్నావేమిటి?"

"మీకు తెలీదులెండి... ఆ... ఇంతకీ రేవంత్ ఎలా తిరిగొచ్చాడు!"

"కూర్చో చెప్తా..." సుమిత్రని సోఫాలో కూర్చోబెట్టి చెప్పసాగాడు.

"పార్కులో నీళ్లల్లో పడిపోతే రేవంత్‌నెవరో చూసి రక్షించి ఇంటికి తీసుకెళ్లారుట. వెళ్లిన దగ్గర్నుంచీ రేవంత్‌కి విపరీతమైన జ్వరం వచ్చి స్పృహ లేకుండా పడివున్నాడట. నిన్ననే స్పృహ వచ్చిందట. తన గురించి చెప్పి వాళ్లని ఇంటికి తీసుకొచ్చాడు. అడగడం మరిచాను. నేను వచ్చేసరికి మీరిద్దరూ ఎందుకలా ఏడుస్తున్నారు?"

"ఏం లేదుగానీ... రేవంత్ క్షేమంగా ఇంటికి చేరాడు... అంతేచాలు..." అంది ఆనందంతో కళ్లు చెమ్మగిల్లుతుండగా

"మావాడా? రవీ... రేవంత్..."

సుమిత్ర ఏదో అనబోతుండగా శ్రీనివాసరావు అడ్డుకున్నాడు.

"సుమిత్రా! మళ్లీ మొదలెట్టావా?"

"లేదండీ! ఇద్దరినీ పోల్చడంలేదు... రేవంత్ తిరిగొచ్చాడు అతనికేం కాలేదని చెప్తున్నానండీ... అంతే..."

"అంతే అయితే ఫర్వాలేదు... సుమిత్రా! ఒక్కటి గుర్తుంచుకో. ఈ కాలపు పిల్లలు అమాయకులు కారు... అగ్గిపిడుగులు..." నవ్వి రవిని దగ్గరకు తీసుకున్నాడు శ్రీనివాసరావు!

*



ధర

నీ సైకిలు 300రూపాయలకు అమ్ముతానన్నావుగా. ఇదిగో డబ్బు సైకిలివ్వు" అడిగాడు అప్పారావు.

"మూడొందలు కాదండి.305 రూపాయలు కావాలి"

"నిన్న సాయంత్రమేకదయ్యా మూడొందలు అన్నావు"

"ఈరోజు ఉదయమే ఆ సైకిలుకి రెండు పంచర్లు వేయించాను. అందుకే ధర పెరిగింది" చెప్పాడు అప్పారావు.

కొంపెల్ల సోమయాజులు
(హైదరాబాద్)



డబ్బింగ్

'శివ' హిందీ వెర్షన్ రిలీజ్ తర్వాత నాగార్జున తెలుగు చిత్రాలు కొన్ని హిందీలోకి డబ్ అయి విడుదలయ్యాయి.

'విక్కీదాదా' — 'విక్కీదాదా'గా, 'అగ్ని' 'శివదాదా'గా ఇటీవలే హిందీలో రిలీజ్ అయి కలెక్షన్‌లలో పరవాలేదనిపించుకున్నాయి.

ఇప్పుడు నాగార్జున మరో చిత్రం 'ప్రేమ యుద్ధం' 'ప్రేమ్‌యుద్ధ్' పేరిట అనువాదం అవుతోంది.

—బి.పద్మజ

